## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజశ్యామల అమ్మవారు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో రాజశ్యామల అమ్మవారికి అభిషేకం, హోమం తదితర విశేష పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించారు. పౌర్ణమి పురస్కరించుకొని ఉత్తరాది మఠంలో నిత్య పూజ, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

### యూపీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని శ్రీరామనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. మందుల గదికి సంబంధించిన రికార్డ్స్, రిపోర్ట్సును పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అబా ఐడీని జనరేట్ చేసి వారికి అందించిన ఆరోగ్య సేవలు, పరీక్షల వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భవతులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన వ్యాధినిరోధక టీకాలను వంద శాతం అందేలా చూడాలని ఆదేశించారు. వైద్యాధికారి డాక్టర్ దివ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఫూటుగా మద్యం తాగిస్తే మంచి ప్రభుత్వమా?

కర్నూలు(సెంట్రల్): పూనకాలు వచ్చే వరకు మద్యం తాగిస్తే మంచి ప్రభుత్వం అవుతుందా? అని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలివేలు, అరుణ గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు.జిల్లాలో రెండు రోజులుగా ఎలాంటి నిబంధనలు పాటించకుండా మద్యం షాపులను ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. బడి, గుడి, జన ఆవాసాల మధ్య షాపులు ఏర్పాటు చేయరాదని నిబంధనలు ఉన్నా టీడీపీ ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకొని వ్యాపారులకు సహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే మహిళలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తారని స్పష్టం చేశారు.


### వక్ఫ్ చట్టాన్ని ప్రభుత్వం వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సుభాన్

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్, కమిటీ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసం చట్టానికి సవరణలు చేయడానికి సన్నద్ధమైందన్నారు. దీన్ని గమనించిన కేరళ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని చెప్పారు. అదే మాదిరిగా ఏపీలోనూ తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని వారు డిమాండ్ చేశారు.

### పారదర్శక బదిలీలపై హర్షం



వై.నాగరాజు

కర్నూలు (టౌన్): జిల్లాలో పోలీసు బదిలీలు పారదర్శకంగా చేపట్టడంపై జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.నాగరాజు గురువారం ఒక ప్రకటన ద్వారా ఎస్పీ బిందుమాధవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 281 మంది పోలీసుల సాధారణ బదిలీల్లో ఎలాంటి ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పార దర్శకంగా చేపట్టారని ప్రశంసించారు. అన్ని పోలీసు సబ్ డివిజన్ అధికారులు పోలీసు సి బ్బందికి ఇచ్చిన ఆప్షన్స్‌లో వారు కోరుకున్న స్టేషన్లకు బదిలీపై వెళ్లేందుకు వెసులుబాటు కల్పించారని తెలిపారు. పోలీసు చరిత్రలో ఎప్పుడు జరగని విధంగా సాధారణ బదిలీలు, వినతి బదిలీలు, మెడికల్‌కు సంబంధించిన బదిలీలు, స్పౌస్ బదిలీలు చేపట్టారని పేర్కొన్నారు.

### పీజీ ప్రవేశాలకు అవకాశం కల్పించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో పీజీలో ప్రవేశాలకు అవకాశం కల్పించాలని పలువురు విద్యార్థులు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య ఎన్.నరసింహులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నాగరాజు, రామకృష్ణ మాట్లాడుతూ.. వర్సిటీలో పీజీ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీ సెట్ రాయని విద్యార్థులకు అవకాశం కల్పించి ఉన్నత విద్యను చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు.

# నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ప్రక్షాళన

- ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్లను తప్పించి 110 మంది సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు
- తాగునీటి ఫిర్యాదులు రాకుండా పక్కాగా చర్యలు
- ఇద్దరు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లపై వేటు ?




కర్నూలు (టౌన్): పాణ్యం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని 26 నుంచి 37వ వార్డులకు మంచినీటి సరఫరాకు కె.వెంకటరాముడు ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండడంతో విష్ణు టౌన్‌షిప్ వాసులు ఆయనపై ఫిర్యాదు చేశారు. వాస్తవాలు తెలుసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు విచారణ చేశారు. సరైన సమయంలో నీటి సరఫరా చేయకపోవడం, ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని నిర్ధారణ కావడంతో ఇంజినీరింగ్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.'

➡ ఇక నగరపాలక సంస్థ పరిధిలోని 19, 20వ వార్డుల్లో పనిచేసే ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఫీపై స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. నీటి సరఫరాలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని కాలనీ వాసులు అనేక ఫిర్యాదులు చేశారు. ఎన్నిసార్లు చెప్పిన వైఖరి మార్చుకోకపోవడంతో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.'

➡ లక్ష్మీపురం, పందిపాడు గ్రామాల పరిధిలో లెక్కకు మించి అనధికారికంగా కనెక్షన్లు ఇచ్చారని ఆ ఏరియా పరిధిలో తృతీయ శ్రేణి ఇంజినీర్, సిబ్బందిపై తీవ్ర ఆరోపణలున్నాయి. ఒక్కో అనధికార కనెక్షన్ కోసం రూ.30 వేలు వసూలు చేశారు. ఇక లక్ష్మీపురం దాటి అనధికారికంగా పైపులైన్లు వేయడం (నగరపాలక సంస్థ పరిధిని మించి)పై ఇదే సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. విజిలెన్స్ అధికారులు వాటర్ వర్క్స్ అక్రమాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వినిపిస్తోంది

#### ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్లపై వేటు..?

ఇప్పటికే షోకాజ్ నోటీసులు అందుకున్న ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్లపై వేటుకు రంగం సిద్ధమైంది. ఫిర్యాదుల నేపథ్యంలో వీరిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి మంచి నీటి సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని పరిశీలించడం, పర్యవేక్షణ చేయాల్సిన ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోకపోవడంతోనే అసలు సమస్యలు వస్తున్నాయని నగరపాలక అధికారులు గుర్తించారు. ఇక వేటు తప్పా మరో మార్గం లేదన్న నిర్ణయానికి వచ్చారు. మొత్తం ఇన్‌చార్జ్ బాధ్యతలు వెలగబెడుతున్న ట్యాప్ ఇన్‌స్పెక్టర్లందరినీ తప్పించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది.

#### సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు

నగరపాలక సంస్థ పరిధిలో 52 డివిజన్లు ఉన్నాయి. 132 సచివాలయాలలో సివిల్ ఇంజినీరింగ్ కార్యదర్శులు 110 మంది ఉన్నారు. వీరందరినీ పక్కన పెట్టి ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్లే పెత్తనం చెలాయించేవారు. దీనిపై దృష్టి సారించిన నగరపాలక ఉన్నతాధికారులు ప్రక్షాళన చేసేందుకు నిర్ణయించారు. సచివాలయాల్లోని సివిల్ ఇంజినీరింగ్ కార్యదర్శులు ఆ సచివాలయ పరిధిలో ఇంటింటి సర్వే చేయాలి. మంచినీటి సరఫరాకు సంబంధించి స్థానికులతో మాట్లాడాలి. ఇబ్బందులు తెలుసుకోవాలి. ప్రతి రోజు నీటిని పరీక్షించాలి. వాటర్ వర్క్స్ నుంచి మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకున్నా, కేవలం ట్యాప్ ఇన్‌స్పెక్టర్ల నుంచి సమస్యలు వస్తున్నాయని గుర్తించిన అధికారులు ఇక ప్రతి పనిని సివిల్ ఇంజినీరింగ్ సిబ్బందికే అప్పగించారు. నీటి సరఫరాతో పాటు సచివాలయాల పరిధిలో సివిల్ ఇంజినీరింగ్‌కు సంబంధించి డ్రైన్లు ఏవిధంగా ఉన్నాయి. కల్వర్టులు, సీసీ రోడ్లు ఇలా ప్రతి పనిని బాధ్యతగా చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీటి నమూనాలను సేకరించడం, ఫిర్యాదులను తెలుసుకోవడం వంటివి చేస్తున్నారు.

#### ప్రక్షాళనకు చర్యలు

సిబ్బంది ఉన్నా.. నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు, ఫిర్యాదుల నేపథ్యంలో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు అధ్వానంగా ఉందంటూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు, అనధికారికంగా కనెక్షన్లు ఇచ్చి కలెక్షన్లు చేస్తున్న ఇద్దరు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లపై వేటు పడనుంది. ప్రభుత్వం మారి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటికీ వాటర్ వర్క్స్ సిబ్బంది అదే పనితీరు ప్రదర్శిస్తుండటంతో తప్పించాలన్న నిర్ణయానికి అధికార యంత్రాంగం వచ్చింది. ప్రజా ప్రతినిధుల దృష్టికి సైతం కాలనీ వాసులు మంచినీటి సమస్యలను తీసుకురావడంతో ట్యాప్ ఇన్‌స్పెక్టర్లపై తీవ్రమైన విమర్శలు వచ్చిన నేపథ్యంలో వీరిని తప్పించేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి రోజు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని కాలనీలలో మంచి నీటి సరఫరా సకాలంలో చేయకపోవడం, ఫోన్లు చేస్తే స్పందించకపోవడం, ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడం, నీటి సరఫరాలో ఇబ్బందులు, కలుషితం ఫిర్యాదుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకం




మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్):ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకమని కర్నూలు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండర్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. మెరుగైన పాలనకు బాటలు వేస్తూ పౌరుల బంగారు భవితను ఓటే నిర్దేశిస్తుందని చెప్పారు. దేశ గతిని మార్చేది వ్యవస్థలో మార్పునకు నాంది పలికేది ఓటేనన్నారు. చైతన్యశీలురైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి దీపస్తంభాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఆర్ఓ, తహశీల్దార్ వెంకటలక్ష్మీ, డీటీ ధనుంజయ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ గురువారం స్థానిక పెద్దమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఏవైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసు కురావాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతకు అభినందన



ఉపాధ్యాయుడు దీపక్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కేరళ రాష్ట్ర రాజధాని త్రివేండ్రంలో అక్టోబర్ 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 53వ కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ మీట్‌లో బంగారు పతకం సాధించిన కేంద్రీయ విద్యాలయ సంస్థ ఉపాధ్యాయుడు ఆర్.దీపక్‌కుమార్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. గురువారం కలెక్టర్ తన చాంబరులో దీపక్‌కుమార్‌కు శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. 400 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల హర్డిల్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించడంపై ప్రశంసించారు. నవంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొనేందుకు దీప్‌కుమార్‌కు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. జిల్లా క్రీడల అధికారి భూపతిరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ పాయల్ ప్రియాంకదర్శన్, కోచ్ కె.హారిక ఉన్నారు.

### రక్తహీనత నివారణపై అవగాహన



రక్తహీనత గురించి అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థుల్లో రక్తహీనత కారణంగా తీవ్ర అనారోగ్యం కలుగుతుందని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. నగరంలోని ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గడియారం ఆసుపత్రి పక్కన ఉన్న ఉర్దూ పాఠశాలలో గురువారం విద్యార్థులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. రక్తహీనత వల్ల విద్యార్థులు నీరసం, నిస్సత్తువ పెరిగి చదువులో వెనుకబడిపోతారన్నారు. హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త ఎం.రాములమ్మ, ఆశా కార్యకర్త అరుణ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## డాక్టర్ కేజీ గోవిందరెడ్డికి సన్మానం



డాక్టర్ కేజీ గోవిందరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ జీఎన్ రావు

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానంపై చేస్తున్న విశిష్ట సేవలకుగాను కర్నూలు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌లో వ్యవస్థాపకులు డాక్టర్ జీఎన్ రావు చేతుల మీదుగా జ్ఞాపికతో సత్కరించారు. కర్నూలు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోట్ల విజయభాస్కర రెడ్డి ఐ బ్యాంకు ద్వారా నేత్రదాన సేకరణ, నేత్ర దానంపై అవగాహన, 1,50,000 మంది నేత్రదానానికి అంగీకారం తెలిపి ఫారంపై సంతకం చేసి ఇచ్చారని, ఈ మేరకు తనకు ఈ సత్కారం లభించిందని డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తెలిపారు.

## ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ప్రగతి పనుల వివరాలను తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ ఆర్.జి.వి.క్రిష్ణ

కర్నూలు (టౌన్): సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి.క్రిష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక భాగ్యనగర్ 30వ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెలవుల నమోదు, హాజరు పట్టికను పరిశీలించారు. లాగిన్‌లో నమోదైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేదికలను రూపొందించాలని, అంగన్ వాడీ, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు, విధుల్లో భాగంగా బయటకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పలు రికార్డులను, దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రెవెన్యూ ఆధికారి జునీద్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి



శోభాయాత్రలో పాల్గొన్న వాల్మీకి నేతలు



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు



మెడికల్ కాలేజీలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: భారతీయ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసిన మహర్షి వాల్మీకి అని రాయలసీమ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి అన్నారు. గురువారం వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ భారతీయ కుటుంబ జీవన పరమార్థాన్ని తెలిపేదే రామాయణమన్నారు. వర్సిటీ రీసెర్స్ డైరెక్టర్ ఆచార్య విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య భరత్ కుమార్ మాట్లాడా రు.టీచింగ్ ఫ్యాకల్టీ, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

➡ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆర్.లోకనాథ వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

➡ ధర్నా చౌక్‌లోని వాల్మీకి విగ్రహానికి వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి పూలమాల వేసి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ అడవిలో వేటాడుతూ జీవించే రత్నకరుడనే బోయవాడు సాక్షాత్ ధర్మమూర్తి, మానవ జాతికి ఆదర్శ ప్రాయుడైన భగవాన్ శ్రీరామ చంద్రమూర్తి జీవిత చరిత్రను రచించి మహర్షి వాల్మీకిగా చరిత్రకెక్కాడని కొనియాడారు. వీహెచ్‌పీ సభ్యులు గోరంట్ల రమణ సందడి మహేష్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ప్రాంగణంలో వాల్మీకి చిత్రపటానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌లు పూలమాలలు వేసి పూజలు చేశారు.

కర్నూలు(అర్బన్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పలు బీసీ, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అలాగే బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి, బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మికాంతయ్య, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జీ అయ్యన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

➡ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో పర్యవేక్షకులు సీమోన్, ఉద్యోగులు ఆశీర్వాదమ్మ, వంశీ నాయక్, జిల్లా పరిషత్ కార్యాలయంలో డి ప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు.

కర్నూలు(హాస్పిటల్): వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యం సమస్త మానవాళికి ఆదర్శమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. వాల్మీకి రామాయణం నేటి తరానికి ఎన్నో స్ఫూర్తిదాయక అంశాలను తెలియజేస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ధర్మమార్గంలో నడుద్దాం



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): మహర్షి వాల్మీకి రామాయణం ద్వారా చూపిన ధర్మ మార్గంలో నడుద్దామని నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. గురువారం స్థానిక గౌరీగోపాల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మేయర్ మాట్లాడుతూ.. ఆదికావ్యాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి అన్నారు. జాతికి సన్మార్గాన్ని నిర్దేశించారన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి నాగేశ్వరీనాయుడు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎస్పీ

#### ఘనంగా వాల్మీకుల శోభాయాత్ర

కర్నూలు(అర్బన్): వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం నగరంలో వాల్మీకుల శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక బళ్లారి చౌరస్తా ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి గౌరీ గోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహం వరకు శోభాయాత్ర సాగింది. వాల్మీకి మహర్షి నిలువెత్తు చిత్ర పటంతో నగరంలోని వాల్మీకులు భారీగా శోభాయాత్రలో పాల్గొన్నారు. హోంగార్డ్స్ రాయలసీమ రేంజ్ ఎస్పీ మేకల మహేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాములు, శోభాయాత్ర ప్రతినిధులు కుంపటి కృష్ణయ్య, కట్టెల రామాంజనేయులు,ఎస్ఎల్‌వీ రామక్రిష్ణ పాల్గొన్నారు.

#### ఆదర్శ భావాలు అలవర్చుకోవాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరూ మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శ భావాలను అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. గురువా రం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేవారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు, పాల్గొన్నారు.

### మసాలా వ్యాపారికి టోకరా

కర్నూలు (టౌన్): నగరానికి చెందిన ఓ వ్యాపారిని ఖమ్మం జిల్లాకు చెందిన కొంత మంది దగా చేశారు. స్థానిక వెంకటరమణ కాలనీలో నివసించే వెంకన్న చాలాకాలంగా మసాలా దినుసుల వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన 9 మంది మసాలా దినుసులు కొనుగోలు చేసేందుకు సంప్రదించారు. భారీ స్థాయిలో ఆర్డర్ తెప్పించుకున్నారు. దీనికి సంబంధించి రూ.26,31,760 నగదు చెల్లించినట్లు నకిలీ బ్యాంకు స్టేట్‌మెంట్ పంపించారు. వ్యాపారి స్థానికంగా బ్యాంకును సంప్రదించగా ఖాతాలో నగదు జమ కాలేదని తెలిసింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఈ నెల 7వ తేదీన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్పీ వ్యాపార లావాదేవీలు చేసిన ఖమ్మం జిల్లాకు చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునిత, నాగసుధీర్, రాధాకృష్ణ, విజయ్‌కుమార్, రమేష్‌లపై చీటింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు వెల్లడించారు.

## డీపీఓకు సత్కారం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో విజిలెన్స్ అధికారిగా పనిచేస్తూ ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులైన భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. గురువారం సాయంత్రం డ్వామా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ నాసరరెడ్డి, వాటర్‌షెడ్స్ అదనపు పీడీ మాధవీలత తదితరులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. డ్వామా పరిపాలన అధికారి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈఓపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కర్నూలు కల్చరల్: అవినీతి, అక్రమాలకు పాల్పడడంతోపాటు, సొంత బ్యాంకు ఖాతాలోకి దేవస్థానం నిధులను మళ్లించుకున్న కాల్వబుగ్గ ఆలయ ఈఓ పూర్వప్రసాద్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ నాయకులు దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్, జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు, మహేష్ తదితరులు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ తిరుమల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ.. ఈఓ ప్రసాద్ అవినీతిపై జరిగిన విచారణ అంశాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రూ.1.30 కోట్లు దేవుడి సొమ్మును స్వాహా చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

### అందుబాటు ధరకే వంటనూనెలు

కర్నూలు(సెంట్రల్): వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ ధరకే పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు డీఎస్‌ఓ రాజారఘువీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, వెల్దుర్తి, పత్తికొండ, దేవనకొండ, గూడూరులో మొత్తం 24 దుకాణాల ద్వారా పామాయిల్ లీటర్ రూ.110, సన్ ఫ్లవర్ లీటర్ రూ.124 కు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపునీరు

### లోపించిన పారిశుద్ధ్యం

కర్నూలు(హాస్పిటల్): ఊరూరా తిరిగి ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులు రాకుండా ఉంటాయని సూచనలు, సలహాలు చెప్పే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు వారి కార్యాలయం వద్ద ఉండే అపరిశుభ్రత కనిపించడం లేదు. ఈ కార్యాలయం బయట రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ముళ్లపొదలు పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారింది. చెట్ల పొదలు అధికంగా ఉండటంతో అటువైపు వెళ్లే వారు మూత్రవిసర్జన చేయడానికి అనువుగా మారింది. దీంతో ఈ ప్రాంతం కంపు కొడుతోంది. దీనికితోడు రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.